అవగాహనతో వ్యాధుల నుంచి రక్షణ


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనాథ్

ఎల్కతుర్తి : విద్యార్థులు అవగాహన పెంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ శ్రీనాథ్ తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలోని గురుకుల పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థినులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించారు. సీజనల్‌గా ప్రబలే వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. సరైన ఆహార నియమావళి పాటించాలని, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో సోకే అవకాశం ఉన్న సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రహమాన్, డాక్టర్ రుబీనా, స్వామి, ప్రిన్సిపాల్ సురేఖ, స్వరూప, అజిత, సునీత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు



ఆత్మకూరు : పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్ల కరుణాకర్ స్పష్టం చేశారు. బక్రీద్ సందర్భంగా మండలంలోని కటాక్షపూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం అయన సందర్శించి పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పశువులను తరలించొద్దని చెప్పారు. ఆయన వెంట ఏసీపీ శివ రామయ్య, సీఐ కుమార్ ఉన్నారు.

వాహనాల వేలంతో రూ.78,650 ఆదాయం



పరకాల : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయగా రూ.78,650 ఆదాయం వచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.జగన్నాథరావు తెలిపారు. పట్టణంలోని ఆ శాఖ కార్యాలయ ఆవరణలో డీపీఈఓ ఆర్.లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షణలో వాహనాలను మంగళవారం వేలం వేశారు. ప్రభుత్వం రూ.55,750లు నిర్ణయించగా వేలం ద్వారా జీఎస్టీతో కలిపి రూ.78,650 ఆదాయం వచ్చినట్లు సీఐ చెప్పారు. ఆ ఎస్సై ఎస్.పద్మ, సిబ్బంది లక్ష్మణాచారి, ఎస్.సమ్మయ్య, ఎం.శ్రీనివాస్, పి.సత్తయ్య, ఎ.నర్సింహ రాములు తదితరులు పాల్గొన్నారు.

నివాళి



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన దండు కుమారస్వామి అనారోగ్య కారణాలతో మృతి చెందగా అతడి మృతదేహానికి వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని రవీందర్‌రావు పరామర్శించారు. చైర్మన్ వెంట సర్పంచ్‌లు కంజర్ల రమేశ్, జన్ను కుమారస్వామి, ఎంపీటీసీ తాటికాయల రమేశ్, మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మునిగాల సంపత్ తదితరులున్నారు.

పరామర్శ

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన మానుక ఆగమల్లు, పల్లెపు రాములు మంగళవారం మృతి చెందగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు ఇమాన్యుల్ రాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సంపత్ యాదవ్ పరామర్శించారు. వారి వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డు లెనిన్, నాయకులు దుర్గయ్య, రాజయ్య, శ్రీనివాస్, లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

3న గురుపౌర్ణమి వేడుకలు

వరంగల్ : ములుగురోడ్డు సమీపంలోని శ్రీసద్గురు శివానందమూర్తి సప్త గురుధామంలో జులై 3న గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు శివానంద గురుకల్చర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. మంగళవారం గురుధామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుపౌర్ణమి రోజున దేవతలందరూ భూమి మీదికి వచ్చి గురుదేవులను దర్శించుకుంటారని అన్నారు. మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూ గురపౌర్ణమీ రోజున దేశ విదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం వేడుకలను సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు రేపాల రామచందర్, గందే ఉమాశంకర్, మాదారపు సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛంద సంస్థల ప్రమేయం అసమర్థతకు నిదర్శనం'

విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలల్లో 'తొలిమెట్టు' కార్యక్రమ అమలు తీరు తనిఖీల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను చేయటం విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనమని గవర్నమెంటు టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు జి వెంకటేశం, టి.ప్రకాశ్‌గౌడ్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సేవలను పాఠశాలల్లో మౌలిక వసతల కల్పనకు అవసరమయ్యే సామగ్రి కోసం వినియోగించుకోవాలే తప్ప అకాడమిక్ వ్యవహారాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు తనిఖీలకు భాగస్వాములుగా అవకాశం కల్పించటం తగదన్నారు. ప్రభుత్వం సదరు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని పేర్కొన్నారు.

రైతుకు భరోసా కల్పించడమే లక్ష్యం


లేగదూడలను పంపిణీ చేస్తున్న మహేశ్ అగర్వాల్

ఐనవోలు : వ్యవసాయంలో రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా లేగదూడలను పంపిణీ చేస్తున్నట్లు తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ తెలిపారు. మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో జై దుర్గ గోశాల ఆధ్వర్యంలో రైతులకు 10 లేగదూడలను మహేశ్ అగర్వాల్ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. అనంతరం మహేశ్ అగర్వాల్ మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు రాష్ట్రంలోని అనేక చోట్ల రైతులకు ఉచితంగా లేగదూడలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీల నుంచి కనీసం 5 ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను, గవర్నర్ కోటా నుంచి ఎమ్మెల్సీ స్థానాన్ని గోరక్షకులకు కేటాయించాలని ఆకాంక్షించారు. గోశాలల్లో పశుగ్రాసం, నీరు అందించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎవరైనా పశువులను కబేలాలకు తరలిస్తే గోశాల ఫెడరేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. రవాణాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం తోపాటు సమాచారం అందించిన వారికి తగిన ప్రోత్సాహకం ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి, గోశాల ఫెడరేషన్ నిర్వాహకులు సుమన్, దుర్గం రోజ, తదితరులు పాల్గొన్నారు.

'108'లో మహిళ ప్రసవం



కమలాపూర్ : ప్రసవం నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణి మార్గమధ్యలో 108 వాహనంలోనే పండంటి ఆడబిడ్డను ప్రసవించింది. మండలంలోని గూనిపర్తి శివారులో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. 108 సిబ్బంది ఈఎంటీ వక్కల సంజీవ్, పైలట్ మండ కేదారి, ఆశా కార్యకర్త వక్కల అనిత కథనం ప్రకారం.. మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన వక్కల హారిక పురిటి నొప్పులతో బాధపడుతుండగా సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆమెను హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా గూనిపర్తి దాటిన తర్వాత హారికకు నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ఈఆర్‌సీపీ డాక్టర్ గోపీ సూచనలు, సలహాలతో 108 సిబ్బంది, ఆశా కార్యకర్త వక్కల అనిత డెలివరీ చేయడంతో హారిక పండంటి ఆడశిశువు జన్మించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సత్వరమే స్పందించి సురక్షితంగా ప్రసవం చేసిన 108 సిబ్బందిని, ఆశా కార్యకర్త వక్కల అనితను హారిక కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం


వెంకటాపూర్‌లో ప్రచారం చేస్తున్న శ్రీనివాసచారి

దామెర : గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీడీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసచారి విమర్శించారు. మండలంలోని వెంకటాపూర్, సింగరాజుపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'గడప గడపకు గన్నోజు' కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, దళితులకు భూపంపిణీ, రైతులకు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, తదితరాలు ఎందుకు అమలు చేయలేదన్నారు. బీసీ సామాజిక వర్గానికి ఓటేసి గెలిపించాలని కోరారు. దామెర మండలంగా ఏర్పడి ఏడేళ్లు గడచినా జరిగిన అభివృద్ధి శూన్యమని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రకాశ్, రవీందర్, వెంకట్‌రెడ్డి, చంద్రమౌళి, శివ, ఆంజనేయులు, రామన్న, దిలీప్ పాల్గొన్నారు.

తెలంగాణ పురోగతి ఆదర్శం

ఎల్కతుర్తి : గడచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ సాధించిన పురోగతి దేశానికే ఆదర్శమని భారత జాగృతి జిల్లా కన్వీనర్ మూల రాము గౌడ్ తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయలో చేపట్టిన 'తెలంగాణ వికాస్ అభియాన్' కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడారు. స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణ వ్యవసాయం, విద్య, వైద్య, పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందని చెప్పారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. రాష్ట్రం సాధించిన పురోగతిని విద్యార్థులకు వివరించే లక్ష్యంతో 'తెలంగాణ వికాస్ అభియాన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భారత జాగృతి మండల కన్వీనర్ బేరి యాదగిరి, కోకన్వీనర్ తాళ్ల వీరేశం, స్పెషల్ ఆఫీసర్ పిట్టల జ్యోతి, అధ్యాపకులు స్వరూప, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు 'బీఆర్ఎస్' ప్రోత్సాహం


క్రీడాకారులకు టీ షర్ట్స్ అందిస్తున్న సర్పంచ్ రవి

శాయంపేట : క్రీడాకారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని సర్పంచ్ కందగట్ల రవి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఈగల్స్ టీమ్ వాలీబాల్ క్రీడాకారులకు అతడి తండ్రి సమ్మయ్య జ్ఞాపకార్థం సర్పంచ్ రవి టీ షర్ట్స్, క్రీడా పరికరాలను మంగళవారం అందించి మాట్లాడారు. యువత చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతోనే శారీరక వికాసం, మానసికోల్లాసం కలుగుతాయని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, పోటీల నిర్వహణ తదితరాల ద్వారా యువతను క్రీడల్లో రాణించేలా తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్రీడాకారులను వినియోగించుకుని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో చేనేత సొసైటీ డైరెక్టర్ దిడ్డి ప్రభాకర్, నాయకులు వినుకొండ శంకరాచారి, చింతల వెంకట్రామ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'సోలిపేట'కు సంతాపం

హన్మకొండ : మాజీ రాజ్యసభ సభ్యుడు, భారత చైనా మిత్రమండలి జాతీయ నాయకుడు సోలిపేట రాంచంద్రారెడ్డి మృతిపై ఓపీడీఆర్ సంతాపం ప్రకటించింది. అధికార రాజకీయాల్లో ఉంటూ అత్యున్నతమైన రాజకీయ, మానవీయ విలువలకు కట్టుబడి ఆదర్శవంతమైన జీవితం గడిపిన నాయకుడు రాంచంద్రారెడ్డి అని ఓపీడీఆర్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జతిన్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.విజయేందర్ కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం కుర్చీ కొట్లాటలకు, ఓట్ల రాజకీయాలకు పరిమితమైపోయిందని, నిజమైన ప్రజారాజ్యం నెలకొనలేదని భావించే వారని పేర్కొన్నారు. ఆయన నిత్య చదువరి.. ఆచరణ వాది అని అన్నారు. ఆ ప్రజాస్వామ్యవాదికి వారి హృదయపూర్వక జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భారత చైనా మిత్ర మండలి నాయకులు ఇల్లందుల శోభన్‌బాబు, డాక్టర్ మోహన్‌రెడ్డి రాంచంద్రారెడ్డి మృతికి సంతాపం ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్బీఐ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థులు

ధర్మసాగర్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆధ్వర్యంలో "ఆర్థిక అక్షరాస్యత–2023" అంశంపై మంగళవారం నిర్వహించిన ధర్మసాగర్, వేలేరు, కాజీపేట మండలాల స్థాయి క్విజ్ పోటీల్లో ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జి సంజీవ్, అభిలాశ్ మొదటి స్థానంలో నిలిచారు. వేలేరు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సాహితి, సాహిత్య ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వేలేరులోని విద్యార్థులను గైడ్ టీచర్ వి.శ్రీనివాస్, సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, నారాయణగిరిలోని విద్యార్థులను గైడ్ టీచర్ ఎస్.రాజ్‌పాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


సమ్మె నోటీస్ అందజేస్తున్న రమేశ్, తదితరులు

ధర్మసాగర్ (వేలేరు) : గ్రామ పంచాయతీ (జీపీ)ల్లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని జీపీ సిబ్బంది సంఘం మండల అధ్యక్షుడు నోముల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం వేలేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ లక్ష్మీప్రసన్నకు కార్యాలయంలో మంగళవారం సమ్మె నోటీస్ అందచేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయడంతోపాటు కారోబార్లను, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో జులై 6 నుంచి సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో కారోబార్లు, పారిశుధ్య, ఇతర విభాగాల కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్కతుర్తి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి బాధితురాలికి అప్పగించిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన మేకల సుస్మిత హనుమకొండ నుంచి ఎల్కతుర్తికి వస్తుండగా సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఆమె వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై పరమేశ్ సీఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి సుస్మితకు ట్రైనీ ఐపీఎస్ అంకిత్ శంక్వార్ చేతుల మీదుగా అందజేశారు. తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి ఇప్పించడం పట్ల సుస్మిత పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

● 'కుక్టా' ఆధ్వర్యంలో ధర్నా

కేయూ క్యాంపస్: తెలంగాణా రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) ఆధ్వర్యంలో మంగళవారం కేయూ మొదటి గేట్ వద్ద ధర్నా చేశారు. పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో ఏళ్ల తరబడి కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీల్లోని 1356 మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు ఆర్‌డి ప్రసాద్, చందులాల్, భిక్షపతి, మధుకర్‌రావు, కల్పన, స్వప్న, చీకటి శ్రీనివాస్, మధుసూదన్, బి.ప్రియాంక, సుకన్య, విజయకుమార్, శశిధర్, శ్రీధర్‌రావు, రాజన్‌బాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంలో 'కోత' సమస్య పరిష్కారం

● ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు చొరవతో..

శాయంపేట : రైతుల ధాన్యంలో అదనపు కోత సమస్య పరిష్కారమైంది. వరి ధాన్యంలో నిబంధనలకు విరుద్ధంగా అదనంగా కోత విధిస్తున్నారంటూ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట రైతులు సోమవారం నిరసన తెలిపి ఎస్సై ఎదుట గోడు వెళ్లబోసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సై వీరభద్రరావు సత్వరమే పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో రైస్‌మిల్లర్లు కుమ్మక్కై తూకం వేసిన ధాన్యం బస్తాల్లో మళ్లీ కోత పెడుతున్నారన్న ఆరోపణపై విచారణ చేపట్టారు. ఏపీఎం శ్రీధర్‌రెడ్డి సమక్షంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైతులతో చర్చించారు. అలాగే రైస్‌మిల్లు యాజమాన్యంతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించొద్దని స్పష్టం చేశారు. అదనంగా కోత విధిస్తే మిల్లర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం బస్తాకు 43.500 కిలోల తూకంతో 40 మంది రైతులకు ట్యాబ్‌లో ధాన్యం బస్తాల వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. దీంతో ప్రభుత్వ నిబంధనల మేరకే రైతుల వివరాలు నమోదు చేశారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్సై చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ట్యాబ్‌ల్లో రైతుల వివరాలు నమోదు చేయడంతో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

● బీజేపీ నేతలు విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోశ్‌కుమార్


మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

పరకాల : అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్ తెలిపారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన "మేరా బూత్ సబ్సే మజ్బూత్"తో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆసక్తిగా తిలకించారు. అనంతరం విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోశ్‌కుమార్ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధిలో ప్రపంచ దేశాల్లో ముందుస్థానంతో గుర్తింపు సాధిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలిచి కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలోనూ పార్టీ అత్యధిక స్థానాలతో జయకేతనం ఎగరేయనుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, పట్టణ ఇన్‌చార్జ్ మేకల రాజవీరు, కోశాధికారి మంతెన సంతోశ్, సోషల్ మీడియా కన్వీనర్ నల్ల ప్రవీణ్‌రెడ్డి, కోకన్వీనర్ మెంతుల సురేశ్, పట్టణ నాయకులు కుక్కల విజయ్‌కుమార్, గాజుల నిరంజన్, సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలకు ఇన్‌చార్జ్‌ల నియామకం


మాట్లాడుతున్న నమిండ్ల శ్రీనివాస్

ఐనవోలు : మండలంలోని 33 బూత్ కమిటీలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా నమిండ్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై గ్రామాల వారీగా బూత్ ఇన్‌చార్జ్‌లతోపాటు మండల స్థాయి ఇన్‌చార్జ్‌లను నియమించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీ అనుసరించే విధి విదానాలను నాయకులకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మోటె చిరంజీవి, పీసీసీ మాజీ కార్యదర్శి మార్నేని వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రూపిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు కూస చిరంజీవిరెడ్డి, ఇల్లందుల ఎలీషా, రహీమ్, బరిగెల స్వామి, అరూరి అశోక్, బొమ్మినేని రాకేశ్‌రెడ్డి, బరిగల భాస్కర్, పైండ్ల సంపత్, రాజు, మహ్మద్, సుమన్, మల్లేశం, సాయిబాబా, సతీశ్, రవికుమార్, చిన్న రాజు, ప్రవీణ్, రమేశ్, రహీమ్ ఖాన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికే పరకాల టికెట్ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న విష్ణు

దామెర : రానున్న అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుడికే బీఆర్ఎస్ పార్టీ పరకాల టికెట్ ఇవ్వాలని విద్యార్థి ఉద్యమ నాయకుడు, గూడెప్పాడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు కోరారు. మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో ఉద్యమకారులతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001 నుంచి లాఠీలు, తూటాలకు భయపడకుండా, పోలీసు కేసులకు బెదరకుండా పోరాడినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక గడచిన తొమ్మిదేళ్లలో పరకాల నియోజకవర్గంలో ఉద్యమకారులు అణచివేతకు, వివక్షకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు అవకాశం ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని అధిష్టానాన్ని కోరారు. త్వరలో పరకాల పట్టణంలో 10 వేల మంది ఉద్యమకారులతో భారీ ర్యాలీ, సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు మద్దతివ్వాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారులు చిలువేరు యాదగిరి, నల్ల ప్రణయ్, గౌరె పవన్, దామెర రంజిత్, వడ్డెపల్లి సైలాస్, చిలువేరు నరేశ్, కమలాకర్ పాల్గొన్నారు.

ఆంధ్ర బీసీ కులాలను 'తెలంగాణ'లో చేర్చవద్దు

● రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబమూర్తి


మాట్లాడుతున్న డాక్టర్ బయ్య సాంబమూర్తి

పరకాల : ఆంధ్ర బీసీ కులాలను తెలంగాణలోని బీసీ కులాల జాబితాలో చేర్చవద్దని బీసీ(ఏ) కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బయ్య సాంబమూర్తి స్పష్టం చేశారు. పట్టణంలోని అమరధామంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియమకాలే లక్ష్యంగా సాధించుకున్న తెలంగాణలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఆంధ్ర బీసీ కులాలు కొల్లగొడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి కులాలను తెలంగాణలోని కులాల్లో కల్పడం దారుణమన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లోని బీసీ కమిషన్‌కు బీసీ కులాల వాదనలను వినిపించుకునేందుకు పట్టణం నుంచి బయల్దేరతామని చెప్పారు. ఈ క్రమంలో బీసీ(ఏ) కులాల ప్రజలు లిఖిత పూర్వకంగా విన్నవించుకోవటానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో ప్రొఫెసర్ సాంబయ్య, నేరెళ్ల విజయ్‌కుమార్, పాదిల రాజు, నర్సింహరాములు, టి.రఘువీర్, కె.చందర్, వి.సుధాకర్, సుధీర్, రవితేజ, సుదర్శన్, రాజయ్య, ఎం.తిరుపతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు (బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ డీఈఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రాంనగర్, క్రాంతినగర్, స్కాలర్స్ స్కూల్, భువనేశ్వరి మాత దేవాలయం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఎక్సైజ్ కాలనీ రైతుబజార్, అలీపుర, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.